మణిహారాలు.. ఈ రెండు జాతీయ రహదారులు

రహదారులు నాగరికతకు చిహ్నాలు.. అభివృద్ధికి సోపానాలు.. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా.. అందుకు రవాణా సౌకర్యాలు కీలకం. రాయలసీమలో వెనుకబడిన ప్రాంతమైన చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ రహదారులు వరంగా మారుతున్నాయి. చిత్తూరు ప్రాంత అభివృద్ధికి ఇవి కీలకం కానున్నాయి. ఇందులో ఒకటి చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి కాగా.. రెండోది బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చిత్తూరు-తచ్చూరు హైవే వివరాలు

అంచనా విలువ: రూ.3,998.18కోట్లు
మొత్తం పొడవు: 116.10కి.మీ.
ప్యాకేజీల సంఖ్య: 4 లేన్ల సంఖ్య: 6
పనులు ప్రారంభించినది: 2022 అక్టోబరు
పనులు పూర్తయ్యే సమయం: 2025 నవంబరు



చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారిలోని మాపాక్షి జంక్షన్

చకచకా బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు

చిత్తూరు జిల్లా మీదుగా వెళుతున్న బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారి మొత్తం పొడవు 267కి.మీ. ఈ ఎక్స్‌ప్రెస్ వే కర్ణాటకలోని బేతమంగళం వద్ద ప్రారంభమై బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, గుడిపాల వరకు 85 కి.మీల పొడవున ఉంది. జిల్లాలో ప్రాజెక్టు అంచనా విలువ రూ.4,925 కోట్లు. ఈ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ 25కి.మీలు. ఇందులో కర్ణాటకలో 4.5 కి.మీలు, ఏపీలో 20.5 కి.మీల పొడవున ఉంది. ఈ పనులు ఇప్పటి వరకు 80శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రెండో ప్యాకేజీ 31కి.మీల పొడవున ఉంది. ఇది ఎక్కువ అటవీ ప్రాంతంలో ఉండటంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటి వరకు 60శాతం పూర్తయ్యాయి. ఈ ప్యాకేజీ పనులు వచ్చే ఏడాది జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా ఎంచుకున్నారు. మూడో ప్యాకేజీ 29 కి.మీల పొడవున ఉంది. ఇప్పటి వరకు 93.7 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు ఈ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే రహదారి

బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే వివరాలు


జిల్లాలో ప్రాజెక్టు అంచనా విలువ: రూ.4,925కోట్లు
మొత్తం పొడవు: 85 కిలోమీటర్లు
ప్యాకేజీల సంఖ్య: 4 లేన్ల సంఖ్య: 6
పనులు పూర్తయ్యే సమయం: 2026 జూన్

ఎక్స్‌ప్రెస్ వేకు జిల్లాలో మూడు ఎంట్రీలు

బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వేకు జిల్లాలో మూడు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. కర్ణాటకలో 69 కి.మీల వద్ద ఒకటి ఉండగా.. జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె వద్ద, బంగారుపాళ్యం మండలం మొగిలి వద్ద, గుడిపాల మండలం రామాపురం వద్ద పాయింట్లు ఉంటాయి.



వేపనపల్లె రైల్వే గేటు వద్ద జరుగుతున్న రహదారి పనులు



గాజులపల్లె వద్ద జరుగుతున్న పనులు

- చిత్తూరు- తచ్చూరు హైవే పనులు నవంబరు నాటికి పూర్తయ్యే అవకాశం
- బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి
- ఇక జిల్లాలో పారిశ్రామిక పరుగులు

చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి పనులు ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి పూర్తి కానున్నాయి. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధిలో పరుగులు తీస్తుంది. ఫలితంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రూ.4 వేల కోట్లతో.. నాలుగు ప్యాకేజీల్లో..

చిత్తూరు-తచ్చూరు ఆరు లేన్ల జాతీయ రహదారి చిత్తూరు సమీపంలోని మాపాక్షి వద్ద ప్రారంభమవుతుంది. ఈ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ 0-43.8 కి.మీ వరకు ఉంది. ఇది ఏపీలో 38.8 కి.మీ, తమిళనాడులో 5 కి.మీ పొడవుంది. ఈ ప్యాకేజీ అంచనా విలువ రూ.1,484 కోట్లు. రెండో ప్యాకేజీ 43.8 కి.మీల నుంచి 61.3 కి.మీల వరకు మొత్తం 17.58 కి.మీల పొడవున ఉంది. ఏపీలో 5.88 కి.మీలు, తమిళనాడులో 11.70 కి.మీలు ప్రయాణిస్తుంది. ఈప్యాకేజీ అంచనా విలువ రూ.591.99 కోట్లు. మూడో ప్యాకేజీ 61.3 కి.మీల నుంచి 96 కి.మీల వరకు మొత్తం 34.66 కి.మీలు ఉంది. ఇది ఏపీలో 30.32 కి.మీలు, తమిళనాడులో 4.34 కి.మీలు పొడవున ఉంది. ఈ ప్యాకేజీ విలువ రూ.1,102.63 కోట్లు. నాల్గవ ప్యాకేజీ 96 కి.మీ నుంచి 116 కి.మీ వరకు ఉంది. ఏపీలో ఈ ప్యాకేజీ పనులు లేవు. 20 కి.మీలు కూడా తమిళనాడుకు సంబంధించినవే. ఈ ప్యాకేజీ అంచనా విలువ రూ.818.73 కోట్లు. ఈ ప్యాకేజీ పనులు ఈ ఏడాది నవంబరు 4వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం చేసుకున్నారు.

చిత్తూరు- తచ్చూరు హైవేకు నాలుగు ఎంట్రీలు

చిత్తూరు- తచ్చూరు హైవే చిత్తూరు జిల్లాలో 62.3 కిలోమీటర్లు, తిరుపతి జిల్లాలో 12.7 కి.మీలు ప్రయాణిస్తుంది. దీనికి చిత్తూరు 3.4 కి.మీ వద్ద, గంగాధరనెల్లూరు 12.4 కి.మీల వద్ద, శ్రీరంగరాజపురం 32 కి.మీల వద్ద, నగరి 60 కి.మీల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి.

జిల్లా అభివృద్ధిలో కీలకం..

ఈ రెండు హైవేలు జిల్లాకు మణిహారాల్లా మారి భవిష్యత్తులో అభివృద్ధికి ప్రధాన కారణం కానున్నాయి. జిల్లా వాసులకు చెన్నై, బెంగళూరు నగరాల ప్రయాణం మరింత చేరువ కానుంది. పారిశ్రామిక, ఐటీ రంగాల పరంగా జిల్లా అభివృద్ధి కానుంది. సీఎం చంద్రబాబు ఇటీవల జీడీనెల్లూరులో పర్యటించినప్పుడు.. చిత్తూరు-తచ్చూరు హైవేకు సమీపంలో పారిశ్రామికవాడ కోసం రెండు వేల ఎకరాలను సేకరించమని అధికారులకు ఆదేశించారు. అంటే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో సెజ్ వచ్చినా ఆశ్చపడాల్సిన అవసరం లేదు. ఈ రెండు హైవేలతో జిల్లావాసుల ఆశలు చిగురిస్తున్నాయి. చిత్తూరు-తచ్చూరు హైవే తమిళనాడులోని ఎన్నూరు ఓడరేవుకు అనుసంధానం చేస్తుండడంతో వాణిజ్యపరంగా ఎగుమతులు, దిగుమతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ కారణంగా జిల్లాలో ఆర్థిక వనరులు అభివృద్ధి చెందుతాయి.

డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తీసుకోవడానికి ఆసక్తి కలిగిన బీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అభ్యర్థులు https://mdfc.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

29న జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం ఈనెల 29న జరగనుందని సీఈవో రవికుమార్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని జిల్లా స్థాయి అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

ఠారెత్తించిన భానుడు

నాలుగు మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



బోసిపోయిన కలెక్టర్ బంగ్లా సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత అధికంగా ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు వడగాల్పులు వీస్తున్నాయి. శుక్రవారం నాలుగు మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించి నమోదయ్యాయి. దీంతోపాటు గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. నగరి, తవణంపల్లె మండలాల్లో అత్యధికంగా 41.2, కుప్పంలో అత్యల్పంగా 34.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. శ్రీరంగరాజపురంలో 41, సదుంలో 40.7, చిత్తూరు, గుడిపాలలో 39.4, బంగారుపాళ్యంలో 38.7, యాదమరిలో 38.6, పులిచెర్ల, పూతలపట్టు, సోమల, వెదురుకుప్పంలో 38.4, రొంపిచెర్లలో 38.1, గంగవరం, పెద్దపంజాణిలో 38, చౌడేపల్లె, గంగాధరనెల్లూరు, ఐరాల, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురంలో 37.9, కార్వేటినగరంలో 37.4, గుడుపల్లె, శాంతిపురంలో 36.8, బైరెడ్డిపల్లెలో 36.1, వి.కోటలో 35.9, పలమనేరు, పుంగనూరులో 35.3, రామకుప్పంలో 34.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేటినుంచి రెమిడియల్ తరగతులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు శనివారం నుంచి రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 20,796 మందికి 6,850 మంది ఫెయిలయ్యారు. వీరికి మే 19 నుంచి 28వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో 28,261 మందికి 10,011 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. వీరికి మే 12 నుంచి 20వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు మే 28 నుంచి జూన్ ఒకటో తేదీవరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఫెయిలైన విద్యార్థులకు వారి పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు జరగనున్నాయి.

బంగారం.. భగ భగ..!

గ్రాము ధర రూ.9,005

'అక్షయ తృతీయ' కొనుగోళ్లు తగ్గుతాయంటున్న వ్యాపారులు

అక్షయ తృతీయ రోజున ఎంతో కొంత బంగారం కొనుగోలు చేయడం మనవాళ్లకు ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది బంగారం ధర రాకెట్ వేగంతో దూసుకెళుతోంది. శుక్రవారం చిత్తూరులో బంగారం గ్రాము ధర రూ.9,005గా ఉంది. ధర ఇలాగే ఉంటే 'అక్షయ తృతీయ' కొనుగోళ్లు తగ్గుతాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరులో వెలవెలబోతున్న బంగారం దుకాణం

చిత్తూరు నగరంలో సుమారు 130 బంగారం దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో సుమారు మరో 100-120 దుకాణాలున్నాయి. పెద్ద దుకాణాల్లో అక్షయ తృతీయ ఒక్కరోజే ఒక్కో దుకాణంలో రూ.కోటిపైగా వ్యాపారం జరుగుతుంది. చిన్న షాపుల్లో స్థాయిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు జరుగుతుంది. ఆ రోజున ఉదయం ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు బంగారం దుకాణాలు కళకళలాడుతాయి.



బంగారు ఆభరణాలు

916 బంగారం కొనాలంటే..

ప్రజలు ఆభరణాల్లో 916 బంగారాన్నే కొంటారు కాబట్టి.. దాన్ని ఓసారి పరిశీలిస్తే శుక్రవారం చిత్తూరులో ఓ గ్రాము 22 క్యారెట్ (916) బంగారం ధర రూ.9,005 ఉంది. దీనికి 3 శాతం జీఎస్టీ, ఆభరణాన్ని బట్టి మేకింగ్ ఛార్జీలు కలుపుకుంటే మరో రూ.900 అదనం. మొత్తంగా ఓ గ్రాము బంగారు ఆభరణం కొనాలంటే రూ.10వేల వరకు చెల్లించాల్సిందే. ఓ తులం బంగారం కొనాలంటే సుమారు రూ.లక్ష ఖర్చు పెట్టాల్సి వస్తోంది. 24 క్యారెట్ బంగారం ధర ఎప్పుడో లక్ష దాటేసింది. శుక్రవారం చిత్తూరులో 24 క్యారెట్ బంగారం రూ.9,820గా ఉంది. దీనికి జీఎస్టీ, మేకింగ్ చార్జీలు అదనం.

ధర పెరగానికి కారణమిదే..

అమెరికా- చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. యూఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3500 డాలర్లకు చేరువలో ఉంది.



పెళ్లిళ్ల సీజన్ అయినా వ్యాపారం లేదు

సామాన్యులు బంగారం దుకాణాల వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొని ఉంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినా వ్యాపారం జరగడం లేదు. తాళిబొట్టు తప్ప మరేం కొనడం లేదు. గతంలో మా దుకాణంలో రోజుకు సుమారు రూ.25 లక్షల వ్యాపారం జరిగేది. ధరలు ఆకాశాన్నంటడంతో ప్రస్తుతం రోజుకు రూ.5 లక్షల వ్యాపారం మాత్రమే జరుగుతోంది. కొన్నిసార్లు రోజంతా ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ధర ఇలాగే ఉంటే ఈనెల 30వతేదీన వస్తున్న అక్షయ తృతీయ రోజున కూడా కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉంది. - రవి, సీఆర్‌సీ జ్యువెలర్స్, చిత్తూరు

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ తరగతులపై ఆసక్తి ఉన్న వారు ఈనెల 28వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 06016లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గూగుల్‌తో త్వరలో టీటీడీ ఒప్పందం

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): గూగుల్ నుంచి ఏఐ సంబంధ ఐటీ సేవలు పొందేందుకు ఆ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. క్యూలైన్‌లో నిరీక్షణ సమయాన్ని తగ్గించడం, గదుల కేటాయింపు వంటి సేవల్లో ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని టీటీడీ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. దీనిపై వివిధ సంస్థల డెమోలను పరిశీలించారు. ఈ సేవలు అందించేందుకు గూగుల్ సంస్థ ముందుకు రావడంతో వారితో ఎంవోయూ కుదుర్చుకోవాలని గత నెలలో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారు. విధివిధానాలను టీటీడీ ఇప్పటికే సిద్ధం చేసింది. త్వరలో గూగుల్ టీం తిరుమలకు చేరుకుని అంగీకార పత్రంపై సంతకం చేయనుంది. ప్రస్తుతం టీటీడీ వినియోగిస్తున్న అప్లికేషన్లను పరిశీలించి, చేపట్టాల్సిన మార్పులు, పొందుపరచాల్సిన నూతన టెక్నాలజీ టూల్స్ వంటి వాటిపై దృష్టిసారించనుంది. ఇక ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్(మన మిత్ర)లో ఇప్పటికే ఉన్న నాలుగు సేవలతో పాటు మరో 15 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది.


శ్రీవారిసేవలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం



ఆలయం ముందు ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించుకున్న ఆయన శుక్రవారం వేకువజామున అభిషేకసేవలోనూ, ఉదయం వీఐపీ బ్రేక్‌లోనూ శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,227

తలనీలాలు సమర్పించినవారు: 28,951





ఆర్మెన్‌పాడులో సాగు చేసిన అంతరపంటలు



శేషాపురంలోని మామిడిలో మిశ్రమ పంటలు



- మిశ్రమ పంటలతో నిరంతర ఆదాయం
- సేంద్రియ పద్ధతుల్లో వినూత్న సాగు

ఏటీఎం సాగుతో ఏడాదంతా సిరులు



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎనీటైం మనీ(ఏటీఎం) సాగు..ఇదేంటని విస్తుపోతున్నారా.. జిల్లాలో కొందరు రైతుల ఇప్పుడు ఇదే బాట పట్టారు. రోజూ నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. వ్యవసాయమంటే నష్టాలతో కూడుకున్నదని పెదవి విరిచేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలానుగుణ మార్పులను అన్వయించుకుంటూ సాగును కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో అంతర్‌పంటల సాగునే రైతులు,ప్రకృతి వ్యవసాయాధికారులు ఏటీఎంగా వ్యవహరిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, పొద్దుతిరుగుడు, జామ తదితర పంటలను మిశ్రమంగా సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. నిరంతరం కొద్దోగొప్పో ఆర్జించగలుగుతున్నారు. జిల్లాలో 70శాతం మంది మహిళా రైతులు ఏటీఎం తరహాలోనే సేంద్రియ ఎరువుతో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుండటంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. గత యేడాది 43,646 మంది ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేశారు. అందులో 20 రకాల మిశ్రమ పంటలు వేశారు. ఏడాదంతా ఆదాయం వచ్చే వంగ, టమోటా, మిరప,గోరుచిక్కుడు, బీర, కాకర,ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ వంటి పంటల సాగుతో ఆదాయం పొందుతున్నారు.

రెట్టింపు ఆదాయం



పదవ తరగతి వరకు చదివాను. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ. మా ఆయన సహకారంతో, వ్యవసాయాధికారుల సూచనలతో కొత్తకొత్త పద్ధతులు నేర్చుకుంటున్నాను. నిమ్మలో అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. పొలం చుట్టూపై కంచెపై తీగజాతి కాకర, బీర, దోసకాయలను పండిస్తున్నాను. ఆకుకూరలు, కాయగూరలతో నిరంతరం ఆదాయం వస్తోంది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. ఏటీఎం సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసంధానం చేయడంతో ఏటా సుమారు రూ.1.50లక్షల ఆదాయం వస్తోంది. కొంతమేర అప్పులు తీర్చాము. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలను ఇళ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

-కొడవలూరు మహేశ్వరి, ఆర్మెన్‌పాడు, ఓజిలి మండలం

ఏడాదిపొడవునా సాగు



ఇంటర్ చదువుకున్నాను. చదువుకుంటూనే పొలం పనుల్లో సాయం చేసేదాన్ని. వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ. క్రిమిసంహారక మందులతో ఖర్చు పెరిగి తక్కువ ఆదాయం వస్తుందని గుర్తించాను. సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నాను. ఖర్చు తగ్గింది. ఆదాయం పెరిగింది. వ్యవసాయాధికారుల సూచనతో ఏడాదంతా ఆదాయం(ఏటీఎం)అర్జించేలా 20 రకాల అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. గతంలో ఎకరాకు రూ.26వేలు ఖర్చయ్యేది. ప్రకృతి వ్యవసాయంలో రూ.19వేలు మాత్రమే ఖర్చవుతోంది. అంతర్ పంటల సాగుతో ఏడాదంతా ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ ఆకుకూరలు, కూరగాయలకు డిమాండ్ ఏర్పడంతో ఊళ్లోనే అమ్ముడుపోతున్నాయి.

- దొండపాటి హేమలత, పాండురంగావారిపల్లె, చంద్రగిరి మండలం

ఆదాయంతోపాటు ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏటీఎం మోడల్స్‌తో నిరంతరం ఆదాయం తెచ్చే అంతరపంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. తరచూ ఆదాయం రావడంతో రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి పద్ధతులను అనుసరించేలా సూచనలిస్తున్నాం. ఈసేద్యం వల్ల రైతాంగానికి ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యానికి దోహదపడే వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాద్‌రావుల ప్రోత్సాహంతో ఈ యేడాది 72,392ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు చేపడుతున్నాం. గత యేడాది 43,646ఎకరాల్లో సాగయ్యింది.

- షణ్ముగం, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

రోజూ డబ్బులు కళ్లజూస్తున్నాం



గతంలో వ్యవసాయం చేస్తే ఖర్చులు పెరిగి అప్పులే మిగిలేవి. దీంతో కొందరు రైతులను స్ఫూర్తిగా తీసుకున్నాను. వారి తరహాలోనో రెండు ఎకరాల పొలంలో సేంద్రియ పద్ధతిలో అంతర్ పంటలు వేశాను. ఆదాయం పెరిగింది. మిశ్రమ పంటల సాగుతో ఏడాదికి రూ.1.48 లక్షలు ఆదాయం వస్తోంది. మామిడిలోనే అంతర పంటలను సాగు చేస్తున్నాను. నా భూమిని రసాయనరహితంగా మార్చుకున్నాను. ఇప్పుడు బాగా దిగుబడి పెరిగింది.



- కె.రాజగోపాల్‌నాయుడు, శేషాపురం, చంద్రగిరి మండలం

ట్రైనీ ఎస్పీ హేమంత్ సేవలు అభినందనీయం



హేమంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఎస్పీ హేమంత్ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. జిల్లాలో ఆరు నెలల పాటు పనిచేసి వెళుతున్న హేమంత్‌కు శుక్రవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అతిథి గృహంలో అభినందన సభ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ హేమంత్ తన వద్ద శిక్షణ పొందడం సంతోషంగా ఉందన్నారు. హేమంత్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు భక్తవత్సలం, ప్రసాద్, విజయశేఖర్, శ్రీనివాసులు, కంట్రోలు రూమ్ సీఐ ఈశ్వర్ పాల్గొన్నారు.

8మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 12 ఎర్రచందనం దుంగలతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం స్థానిక ఎఫ్‌బీవో అనిల్ కుమార్‌తో కలిసి గురువారం నుంచి వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారు. పోలీసులను గమనించిన పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టి 8మందిని పట్టుకోగలిగారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసుల్లో ముగ్గురికి జైలు, జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా గుడుపల్లెకు చెందిన సెల్వం కొన్నేళ్ళుగా శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం చెట్లు నరికి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో 2022లో బీటీఆర్ కాలనీ అటవీ ప్రాంతం పరిధిలోని తిమ్మినాయుడుపాలెం బీట్‌లో గొడ్డలి, కత్తి తీసుకుని అడవిలోకి వెళుతుండగా అప్పట్లో అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇతడిని రిజర్వు ఎస్ఐ వినోద్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మూడేళ్ల పాటు విచారణ సాగింది. తాజాగా రాష్ట్ర ఎర్రచందనం కోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సెల్వంకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఫారెస్టు బీట్ అధికారులు చెప్పారు.

- నెల్లూరు జిల్లా రాపూరు మండలానికి చెందిన చల్లా రమణయ్య, బత్తల పెంచలయ్య కలసి 2014లో రాపూరు రేంజ్ పరిధిలో నుంచి 83 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను తీసుకెళుతుండగా అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. తొలుత ఈ కేసు విచారణ వెంకటగిరి కోర్టులో సాగింది. ఆ తర్వాత తిరుపతి ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయింది. కొంత కాలంగా వాదనలు సాగాయి. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీకాంత్.. ఈ ఇద్దరు నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.ఐదువేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీగా రామశాంతి వాదనలు వినిపించారు. లైజన్ అధికారిగా చంద్రశేఖర రాజు, ఎం.రఘు వ్యవహరించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణ ప్రసాద్

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభమైనట్లు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, తిరుపతిలో రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్‌లో 2025-26 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బీఎస్సీ మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటినరీ కోర్సుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు కోర్సులకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎలాంటి వయోపరిమితీ లేదన్నారు. ఈ కోర్సులు పూర్తయిన తర్వాత ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. బ్యాంకు రుణ సదుపాయం ఉందన్నారు. బాలబాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604లను సంప్రదించాలని కోరారు.

పుత్తూరులో జమ్మూకశ్మీర్ యువకులు

- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- విచారించి వివరాల సేకరణ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్ యువకులను చూసి పుత్తూరు ప్రజలు అనుమానించారు. పట్టణంలోని కావమ్మ గుడి ఎదురు కాలనీలో ముగ్గురు యువకులు ఉండడం, వీరంతా 25 ఏళ్ల వారు కావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వీరిని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముషాదిక్ హుస్సేన్, పంకజ్, అహ్మద్ హుస్సేన్‌ను ఎస్ఐ ఓబయ్య పిలిపించి విచారించారు. వీరు జమ్మూకశ్మీర్‌లోని రాంబన్‌కు చెందిన వారుగా తెలిసింది. దాదాపు 6 నెలల కిందటే అరక్కోణం, పుత్తూరు తదితర ప్రాంతాల్లో రైల్వే కాంట్రాక్ట్ పనులు చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు లేవన్నారు. వారిని పూర్తిస్థాయిలో విచారించాక, వివరాలు సేకరించుకుని పంపించేశారు.

సమ్మెను జయప్రదం చేయండి



లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న మధు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 20వ తేదీన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పెనుమల్లి మధు కోరారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆయన ఆవిష్కరించారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సవరణ చేసిన ఈ చట్టాలు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నాయన్నారు. సమ్మెలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర. వేణుగోపాల్, మాధవ్, బుజ్జి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 'మయూర' జయరాం చౌదరి

- ఎన్ఐ యాక్ట్ కేసులో అరెస్టుకు కోల్‌కతా హైకోర్టు ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మయూర షుగర్స్ అధినేత జయరామ చౌదరిని ఈస్ట్ పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కోల్‌కతాకు చెందిన టెరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామచౌదరి ఒప్పందం కుదుర్చుకుని రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. అడ్వాన్సుగా తీసుకున్న రూ.8 కోట్లలో రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో టెరాయ్ ఓవర్సీస్ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. ఆ క్రమంలో హైకోర్టు ఆయనపై అరెస్టు వారంట్ జారీ చేసింది. తిరుపతి జిల్లా పరిధిలో నివాసం ఉన్నందున ఆయన్ను అదుపులోకి తీసుకుని కోల్‌కతా పోలీసులకు అప్పగించాలని ఎస్పీని ఆదేశించింది. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో ఈస్ట్ పోలీసులు అధికారులు, సిబ్బంది కలసి చెన్నై నగర శివార్లలోని ఓ లాడ్జీలో వున్న జయరామ చౌదరిని శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం తిరుపతికి బయలుదేరారు. ఎస్పీ ద్వారా కోల్‌కతా పోలీసులకు అప్పగిస్తారని సమాచారం.

ఎస్వీయూ పరీక్షల అధికారిగా రాజమాణిక్యం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల అధికారి(సీఈ)గా డాక్టర్ రాజమాణిక్యం నియమితులయ్యారు. దామ్లానాయక్ స్థానంలో ఈయన్ను నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పరీక్షల అధికారిగా రాజమాణిక్యం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఐరాల మండలం వడ్రాణంపల్లెకు చెందిన రాజమాణిక్యం, ఎస్వీ యూనివర్సిటీలోనే పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1986లో తెలుగు విభాగంలో అటెండరుగా ఉద్యోగంలో చేరారు. జూనియర్ అసిస్టెంట్‌గా పరీక్షల విభాగంలో సేవలందించారు. సెంట్రల్ లైబ్రరీలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా, ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఏవో)గా, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ (ఈ-2)లో అసిస్టెంట్ రిజిస్ట్రారుగా, పరిపాలనా భవనంలోని అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచ్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో సీఈగా నియమితులైన రాజమాణిక్యంను పలువురు అభినందించారు.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్టు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు పేర్కొంది.

హైదరాబాదులో ముగిసిన రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు


రామకృష్ణారెడ్డి పార్థివదేహం

వెదురుకుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాదు తార్నాకలోని చంద్రమతి ఆర్యన్ శ్మశాన వాటిలో పూర్తయ్యాయి. అంతకుముందు తార్నాకలోని గాయత్రి టవర్స్‌లో రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని ఉంచారు. హైదరాబాదు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జి.నరేష్‌రెడ్డి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్లు ఆచార్య ఎన్.భక్తవత్సలరెడ్డి, ఆచార్య వి.సత్తిరెడ్డి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ చెన్నకేశవరెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ మునిరత్నం నాయుడు, డాక్టర్ నామిని సుధాకర్‌నాయుడు నివాళి అర్పించారు. బెంగళూరు, తిరుపతి, కుప్పం, కడప నుంచి పలువురు అంత్యక్రియలకు హాజరయ్యారు. రామకృష్ణారెడ్డి కుమార్తె బండి పద్మిని చితికి నిప్పంటించారు.

లా పరీక్షలు నిర్వహించలేం!

ఎస్వీయూ అధికారులకు తెలిపిన పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపాల్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహించే లా పరీక్షలకు కేంద్రంగా స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసింది. అయితే తమ కళాశాలలో లా పరీక్షలను నిర్వహించలేమని ఎస్వీయూ అధికారులకు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో డిగ్రీ, బీఈడీ, పీజీ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించే పరీక్షలకు 1,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో లా పరీక్షలు నిర్వహించడానికి స్థలాభావంతోపాటు సిబ్బంది కొరత కూడా ఉండటంతో లా పరీక్షలు నిర్వహించలేమని తెలిపారు.

అసౌకర్యాల నడుమ పరీక్షలు

పీవీకేఎన్ కళాశాలలో ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు కూడా అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గదుల్లో ఫ్యాన్లు, లైట్లు సరిగా లేవని.. తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ సిబ్బంది అందుబాటులో లేరని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఇన్‌చార్జి జయచంద్రుడు వివరణ ఇస్తూ.. తాము ఎప్పటికప్పుడు ఫ్యాన్లు, లైట్లు బాగు చేస్తున్నామని చెప్పారు. అయినా కొందరు ఆకతాయిల కారణంగా పాడవుతున్నాయన్నారు.

'ఇంటి నుంచే పని'కి స్పందన కరువు

ఆన్‌లైన్ పరీక్షలకు హాజరైంది 17 మందే

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచే పనిచేయడం ద్వారా ఉపాధి కల్పించే అవకాశంపై ప్రభుత్వం సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆదాయం లేనివారు జిల్లాలో 5,79,934 మంది ఉన్నట్లు ఈ సర్వే ద్వారా గుర్తించారు. వీరిలో 14,192 మంది ఇంటి నుంచి పని కల్పిస్తే చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అంగీకారం తెలిపారు. వీరిలో కొందరిని ఎంపిక చేసి గురువారం ఆన్‌లైన్‌లో నమూనా పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించారు. అయితే ఈ పరీక్షకు అమరావతి నుంచి అధికారులు జిల్లాలో వందమందిని ఎంపిక చేయగా, 26మంది మాత్రమే స్పందించారు. చివరికి 17 మంది మాత్రమే హాజరయ్యారు. కాగా, ఏదో ఒక పని చేస్తూ ఉపాధి పొందుతున్నవారు సైతం ఇంటి నుంచే పనిచేసేందుకు వివరాలిచ్చినట్లు అధికారులు గుర్తించారు. మొత్తానికి నమూనా పరీక్షకు వచ్చిన స్పందన ప్రకారం ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మే నెల కోటా బియ్యం 8,500 టన్నులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా బియ్యం కార్డుదారులకు మేనెల కోటా కింద 8,500 టన్నుల బియ్యం జిల్లాకు కేటాయిస్తూ పౌరసరఫరాలశాఖ ఉత్తర్వులు జారీచేసిందని ఆ శాఖ జిల్లా మేనేజరు బాలకృష్ణ తెలిపారు. అదేవిధంగా చక్కెర 250 టన్నులు కేటాయించారని వెల్లడించారు.

ప్రశాంతంగా రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. 756 మంది విద్యార్థులకు 562 మంది హాజరవగా 194 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో 2,025 మందికి 1,082 మంది హాజరవగా 174 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

30న పాలిసెట్

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 30న పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్, కుప్పంలోని డాక్టర్ వైఎస్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కుప్పం, పలమనేరు కేంద్రాలుగా ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కుప్పం పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాలలో 585 మంది, పలమనేరు పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాలలో 1,621 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ రానివారు దరఖాస్తు చేసుకున్న రసీదుతోపాటు రూ.400 రుసుం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకుని దగ్గరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు 30న ఉదయం ఉదయం 9 గంటలకు తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని తెలిపారు. వివరాలకు 99890 64100, 949030 9037 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష కాల పూజలు


మహానందికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో శుక్రవారం సాయంత్రం ప్రదోష కాల పూజలను ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం మూల విరాట్‌కు, స్వామికి ఎదురుగా ఉన్న మహానందికి అభిషేకం చేశారు. ఈ పూజలు తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి వచ్చేస్తున్న జింకలు

చిత్తూరు రిజర్వు ఫారెస్టులో కంచె ఏర్పాటు చేయాలంటున్న వాకర్లు, పాదచారులు


రిజర్వు ఫారెస్టులోని జింకలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జనసంచారం ఉన్న చిత్తూరు రిజర్వు ఫారెస్టు మధ్యలో జింకలు సంచరిస్తున్నాయి. నీరు, ఆహారం కోసం అక్కడి రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. దీంతో అవి ఇతర జంతువుల బారిన పడే ప్రమాదం ఉంది. అందువల్ల అటవీ రోడ్డు వెంబడి కంచె ఏర్పాటు చేయాలని వాకర్లు, పాదచారులు కోరుతున్నారు. అదే సమయంలో ఫారెస్టులో అటవీ జంతువుల కోసం నీరు, ఆహార వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.





'చైత్ర' చిత్రాలు!

ఆశ ఉంటే శ్వాస ఉంటుందంటారు ఆశావహులు.. ఇదిగో మోడు వారిన ఈ చెట్టును చూడండి. చిత్తూరు గిరింపేట దుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న ఈ భారీ వృక్షం నెల రోజుల క్రితం ఆకులన్నీ రాలిపోయి కళావిహీనంగా కనిపించింది. ఈచెట్టు పనైపోయిందనుకున్నారంతా. శిశిరంపోయి చైత్రమాసం వచ్చింది. చెట్టు ఆశలకు ఊపిరిపోసింది. కొమ్మల ఆకుల చిగురింత మొదలైంది. శుక్రవారం నాటికి చెట్టంతా ఆకులతో కళకళలాడుతూ కనువిందు చేస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు ఎండ నుంచి ఈ చెట్టు కింద ఉపశమనం పొందుతున్నారు. మళ్లీ పచ్చదనం పరుచుకున్న వృక్షాన్ని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

25 'బ్లాక్ స్పాట్స్' గుర్తింపు : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో 25 బ్లాక్ స్పాట్ కేంద్రాలను గుర్తించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వివరాలిలా..

- ఎన్‌హెచ్-69పై ఎమ్మెస్సార్ జంక్షన్, చీలాపల్లె క్రాస్, గంగాసాగరం ఆర్ఎంఎం ఫ్యాక్టరీ, యాదమరి జంక్షన్, వరిగపల్లె జంక్షన్, కేజీ సత్రం, మొగిలి ఘాట్ (శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీ), దొరచెరువు (మొగిలి ఘాట్), జగమర్ల క్రాస్, దండపల్లె (వీఎస్సార్) జంక్షన్, పొన్నమాకుల పల్లె క్రాస్, అలకుప్పం (కుక్కలదొడ్డి క్రాస్)
- ఎన్‌హెచ్-42పై గొల్లపల్లె క్రాస్, దేవదొడ్డి, కుమ్మరమడుగు క్రాస్, జువనిపల్లె క్రాస్, నాయనపల్లి పెట్రోల్ బంక్, విజలాపురం క్రాస్, కేసీ హాస్పిటల్.
- ఎన్.హెచ్-40పై.. మురకంబట్టు జంక్షన్.
- ఎన్‌హెచ్-140పై.. తెల్లగుండ్లపల్లె క్రాస్, పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి.
- ఎన్.హెచ్-716పై.. హెచ్‌పీ పెట్రోల్ బంకు, గవర్నమెంట్ ఆస్పత్రి ఎదురుగా, కన్నంమిట్టలను బ్లాక్ స్పాట్ కేంద్రాలుగా గుర్తించారు.

ప్రజలు ఈ బ్లాక్ స్పాట్ కేంద్రాల వద్ద జాగ్రత్తగా ఉండాలని కోరారు. అలాగే రహదారి నియమాలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

50 యూనిట్ల ఇసుక సీజ్

- 3 టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్ స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు



సీజ్ చేసిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్, నిందితులను చూపిస్తున్న పోలీసులు

నగరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని దామరపాకం రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిల్వ చేసి ఉన్న 50 యూనిట్ల (50 ట్రాక్టర్ల ఇసుక) ఇసుకను పోలీసులు సీజ్ చేశారు. అలాగే ఇసుకను తరలిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను, మూడు టిప్పర్లను, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వివరాలను డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. నగరి, విజయపురం పరిధిలోని కుశస్థలీ నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేసి.. రాత్రివేళ తమిళనాడుకు టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నగరికి చెందిన బిలాల్, షేక్, ఉస్మాన్, విజయపురం మండలంలోని కేవీశ్రీరామాపురానికి చెందిన ఉమాపతి వారి అనుచరులు ఇందులో ఉన్నారని గుర్తించారు. శుక్రవారం వేకువ జామున ఇసుకను టిప్పర్లకు లోడ్ చేస్తుండగా పోలీసులు దాడిచేశారు. నగరికి చెందిన ఉస్మాన్(23), తమిళనాడులోని తిరుత్తణితాలూకా శ్రీనివాసపురానికి చెందిన శరవణ(47), తిరుత్తణి తాలూకా మురకంబట్టుకు చెందిన గోపి(40), విజయపురం మండలం శ్రీరామాపురానికి చెందిన మధు(32)లను పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు పంపారు. ఎక్స్‌కవేటర్‌తోపాటు మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి


ధ్వంసమైన అరటి చెట్లు

కల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడి కొనసాగుతూనే ఉంది. కమ్మపల్లె పంచాయతీలో గురువారం రాత్రి కొబ్బరి, అరటి చెట్లను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీప్రాంతంలోని చింతలవంక నుంచి బయల్దేరిన ఒంటరి ఏనుగు కమ్మపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారి పల్లె వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు మోహన్‌రెడ్డికి చెందిన కొబ్బరి, అరటిచెట్లను ధ్వంసం చేసింది. ఇదే రైతు పొలానికి సమీపంలోని బండపై కుప్పపోసిన వరికుప్పను చిందరవందర చేసిన కొంతమేర వడ్లను తినేసింది. అనంతరం వచ్చిన మార్గంలోనే అడవిలోకి చేరుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

కల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పులిచెర్ల మండలంలో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం భాకరాపేట వీధికి చెందిన ప్రసాద్‌రెడ్డి (44) మూడేళ్ల క్రితం కల్లూరుకు వచ్చి హోటళ్లలో పనిచేసుకుంటూ అప్పుడప్పుడూ సొంతూరికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో తలారివారిపల్లెలోని రైతు నాగరాజుకు చెందిన మామిడి తోటలో శుక్రవారం ప్రసాద్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయ్యింగ్ యూనిట్లు తొలగించేవరకు సమావేశాలొద్దు

నగరి మున్సిపల్ కౌన్సిలర్లు


మున్సిపల్ కార్యాలయం వద్ద కౌన్సిలర్ల నిరసన

నగరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల నుంచి డయ్యింగ్ యూనిట్లు తొలగించే వరకు మున్సిపల్ సమావేశాలు నిర్వహించొద్దని కౌన్సిలర్లు ముక్తకంఠంతో నినదించారు. నగరి మున్సిపల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. సభ ప్రారంభించేలోపే కౌన్సిలర్లందరూ చైర్మన్ నీలమేఘం టేబుల్ వద్దకు వచ్చారు. మిషన్, మాన్యువల్ డయ్యింగ్ యూనిట్లను గ్రామాల నుంచి నివాసేతర ప్రాంతాలకు తరలించాల్సిందేనని పట్టుబట్టారు. కమిషనర్ కృష్ణారెడ్డి స్పందిస్తూ డయ్యింగ్ యూనిట్లపై చర్యలు తీసుకోవాల్సింది పొల్యూషన్ బోర్డు మాత్రమేనని తెలియజేశారు. ఏర్పాటైన ఆరు యూనిట్లు సక్రమంగా ఉన్నాయని బోర్డు తెలియజేసిందని చెప్పారు. దీంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. డయ్యింగ్ యూనిట్లు తొలగించే వారు సమావేశాలు బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ బయటకు వచ్చేశారు. కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు.

పొట్టెంవారిపల్లె దివ్యాంగుడి ప్రతిభ

పరిశోధనల కోసం రూ.92లక్షలు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం



దిలీప్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

పుంగనూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వివిధ పరిశోధనల అభివృద్ధికి సదుం మండలం పొట్టెంవారిపల్లెకు చెందిన దివ్యాంగుడైన ప్రొఫెసర్ డాక్టర్ పల్లెల దిలీప్‌రెడ్డికి రూ.92లక్షల గ్రాంట్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం నిధుల ఉత్తర్వులు రావడంతో దిలీప్‌రెడ్డిని ఆయన ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్ నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో సన్మానించారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. చిన్నతనంలో పోలియా బారిన పడ్డానన్నారు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీలను పూర్తిచేసి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో అంధులకు ఉపయోగపడే డాక్యుమెంట్ స్కానర్‌ను మరింత మెరుగుపరిచి దానితో ఈబుక్‌ను, బ్రెయిలీ పాఠ్యరూపాల్లో డాక్యుమెంట్లు తయారీ అనే అంశంపై తన మూడేళ్ల పరిశోధనకు కేంద్రప్రభుత్వ సంస్థ డీఎస్‌టీ నుంచి రూ.47 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలాగే కేంద్రశాస్త్ర సాంకేతిక విభాగం నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ యొక్క బాలల కేంద్రీకృత ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లాలో సైబర్ భద్రతపై అవగాహన, అన్వేషణ అనే అంశంపై ఏడాదిపాటు పరిశోధనకు రూ.17,83,500 మంజూరు చేశారని వివరించారు. తెలుగు భాషలో డీప్ లెర్నింగ్‌ను ఉపయోగించి హెల్త్ కేర్ అనువర్తనాలు అనే అంశంపై మూడు రోజుల సెమినార్‌కు రూ.2లక్షలు, క్వాంటమ్ కంప్యూటింగ్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అనే అంశంపై వారంపాటు ఫ్యాకల్టీ ప్రోగ్రామ్‌కు రూ.3.50 లక్షలు, అణువస్తువుల గుర్తింపు అనే అంశం వారం రోజులకు రూ.లక్ష మంజూరైందని తెలిపారు. ఎంహెచ్ఎంఈలో కొత్తగా చిన్న తరహా పరిశ్రమ ప్రాజెక్ట్‌లు పరిశోధనకు రూ.15 లక్షలు, ఇతర సెమినార్లకు రూ.5.67 లక్షలు వచ్చిందన్నారు. ప్రాజెక్టులు, పరిశోధనలకు దరఖాస్తులు చేయడానికి అవసరమైన సహకారాన్ని కాలేజీ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మోహన్ అందజేశారన్నారు.

కుప్పం మున్సిపాలిటీలో ఏబీసీ సెంటర్

- కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు


సిద్ధమవుతున్న ఏబీసీ సెంటర్

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక పశువైద్యాధికారి పోస్టును ప్రభుత్వం మంజూరు చేసింది. కుప్పం మున్సిపాలిటీయే కాదు, నాలుగు మండలాల్లోని గ్రామాల్లో ఇటీవల కుక్కల బెడద తీవ్రమైంది. ఎక్కడపడితే అక్కడ వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. పిచ్చి కుక్కలైతే వీరంగమాడుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు వీటిబారిన పడి గాయాలపాలవుతున్నారు. ఏటా ఈ కుక్కలు తమ జాతిని పెంచుకుంటూ పోతున్నాయి. ఏ రకమైన నియంత్రణ లేకపోవడంతో ఇది జరుగుతోంది. పశు సంవర్థక శాఖ తీసిన లెక్కల ప్రకారం ఒక్క కుప్పం మున్సిపాలిటీ పరిధిలోనే ఏకంగా ఆరువేల కుక్కలున్నాయి. మళ్లీ ఒక్కో మండలంలో ఐదేసి వేల కుక్కల వంతున ఉంటాయని అంచనా వేశారు. వీటిని ఇలాగే వదిలేస్తే పునరుత్పత్తి వేగవంతమై వచ్చే ఏడాదికల్లా రెట్టింపు సంఖ్య అయ్యే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో కుప్పం పురపాలక సంఘంలో ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. కుప్పం మున్సిపాలిటీ చీలేపల్లె పరిధిలోని చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రం భవనంలో ఈ సెంటర్‌ను నడపడానికి మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని శుభ్రం చేసి ఏబీసీ సెంటర్‌కు అనువైన ఏర్పాట్లు చేయడానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏబీసీ సెంటర్‌లో విధి నిర్వహణకోసం పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అతి త్వరలో సిద్ధం కాబోయే ఏబీసీ సెంటర్‌లో కుక్కలను పట్టుకొచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తారు. ఆపరేషన్ అయిన కుక్కను గుర్తించడానికి వాటి చెవిని కొద్దిగా కత్తిరించి విడిచిపెడతారు. అంతే కాదు.. పిచ్చిగా, ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తూ మనుషులపై దాడిచేసే కుక్కలను పట్టుకొచ్చి ఏబీసీ సెంటర్‌లో ఉంచి ట్రీట్‌మెంట్ ఇస్తారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఏబీసీ సెంటర్ ద్వారా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటి జనాభాను నియంత్రిస్తామని చెప్పారు. గర్భ నిర్ధారణ చేయడానికి ప్రత్యేకంగా ఒక స్కానింగ్ యంత్రాన్ని తెప్పించనున్నట్లు చెప్పారు. మొత్తం నియోజకవర్గంలోని నాలుగు మండలాల కుక్కలకోసం ఏబీసీ సెంటర్‌ను వినియోగిస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చందం గ్రామానికి చెందిన పెయింటర్ మురుగేశ్ పనిచేస్తూ కొద్దికాలం క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పేదవాడు కావడంతో ప్రభుత్వం తరఫున ఆయన కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1.5 లక్షలు మంజూరైంది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు బాధిత కుటుంబాన్ని శుక్రవారం కలిసి వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగం సభ్యుడు కన్నన్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, గోపీనాథ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తీరిన తాగునీటి కష్టాలు


బోరు మోటారును ఏర్పాటు చేస్తున్న నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజాపురంలో ఎట్టకేలకు తాగునీటి కష్టాలు శుక్రవారంతో తీరాయి. ఈనెల 16న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'గిరిజాపురంలో తాగునీటి కష్టాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితం కావడంతో గ్రామానికి తాత్కాలికంగా ట్యాంకర్ తో వారంరోజుల పాటు తాగునీరు అందించారు. కాలిపోయిన బోరు మోటారును టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, వెంకటరెడ్డిల సహకారంతో మర్మమతులు చేయించడంతో నెలరోజుల అనంతరం గిరిజాపురంలో తాగునీటి కష్టాలు తీరాయి. గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి


భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న అధికారులు

గుడుపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నేలలోని పోషకాలు తెలుసుకోవడానికి రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో నాగరాజు కోరారు. శుక్రవారం కనమనపల్లెలో పరీక్ష కోసం మట్టిని సేకరించే విధానాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడటంతో ఎరువుల పెట్టుబడి తగ్గించుకోవచ్చని తెలిపారు.

28న కుప్పంలో 163 సెక్షన్

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను పురస్కరించుకుని ఈనెల 28న కుప్పంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023 కింద 163 సెక్షన్ విధిస్తూ కుప్పం మండల తహశీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వై.చిట్టిబాబు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో సెక్షన్ 144గా పిలుబడిన ఈ 163 సెక్షన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగే కుప్పం మండల సచివాలయానికి వంద మీటర్ల దూరంలో అమల్లో ఉంటుంది. గుంపులు కట్టడం, మారణాయుధాలు ధరించడం, వంటివాటిని సెక్షన్ అమల్లో ఉన్న పరిధిలో నిషేధించారు. ఎన్నికల్లో అవాంఛనీయ, అసాంఘిక చర్యలు జరుగకుండా అడ్డుకట్ట వేయడానికి సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు తహశీల్దారు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పీఈఎస్‌లో ముగిసిన డాక్టర్స్ ప్రీమియర్ లీగ్


విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ 13వ ఎడిషన్ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో తరుణ్స్ లెజెండ్స్ జట్టు, పురుషోత్తమ్స్ పాంథర్స్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవశం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో ప్రదర్శనల ఆధారంగా బెస్ట్ బ్యాట్స్ మెన్ అవార్డును డాక్టర్ కళ్యాణ్, బెస్ట్ బౌలర్ అవార్డు డాక్టర్ సాయికుమార్, బెస్ట్ ఫీల్డర్ అవార్డు డాక్టర్ సాయి తరుణ్‌లు సొంతం చేసుకున్నారు. ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ భరత్, డాక్టర్.సంతోశ్ పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

పలమనేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం పలమనేరులో మే డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించడానికి కుట్రచేస్తోందని ఆరోపించారు. స మావేశంలో పలమనేరు నియోజకవర్గ ఏఐటీయూసీ కన్వీనర్ చెన్నకేశవులు, ఏఐటీయూసీ పలమనేరు నియోజకవర్గ కార్యదర్శి బుర్ర మంజునాథబాబు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో చార్జ్‌షీట్

సదుం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం ఊటుపల్లె పంచాయతీ మద్దెలవారిపల్లెకు చెందిన పల్లం సురేంద్రను కులం పేరుతో దూషించిన కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు సదుం ఎస్ఐ షేక్‌షావలి శుక్రవారం తెలిపారు. భూతగాదాల నేపథ్యంలో పల్లం సురేంద్రపై అదే గ్రామానికి చెందిన గంగాధర్, అతని కుటుంబ సభ్యులు గత ఏడాది అక్టోబర్ 12న దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించారు. అప్పట్లో కేసు నమోదు కావడంతో పలమనేరు డీఎస్పీ ప్రభాకర విచారణ చేపట్టి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో పోలీసులు చార్జ్ షీట్ దాఖలు చేయడంలో ఆలస్యం చేయడంతో కోర్టు విచారణ మందగించింది. ఈ విషయంపై ఈనెల 23న మాలమహానాడు నాయకులు జిల్లా ఎస్పీ మణికంఠను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో సదుం పోలీసులు శుక్రవారం చార్జ్ షీట్‌ను దాఖలు చేసి బాధితులు పల్లం సురేంద్ర, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, దుబ్బా శ్రీకాంత్‌లకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బిక్కంవారిపల్లెకు చెందిన ఆదెప్ప(75) ఎరువుల కోసం శుక్రవారం పుంగనూరు వచ్చి పోలీస్ స్టేషన్ ముందు నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పం గంగ జాతర ఏర్పాట్లకు టెండర్ల ఆహ్వానం

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థానంలో జాతర ఏర్పాట్లకు అవసరమైన పనుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 6 నుంచి 22 వరకు 17 రోజులపాటు ఆయా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవాలయం లోపల, బయట, పుర వీధుల్లో విద్యుత్తు దీపాల డెకరేషన్, చలువ పందిళ్లు, పూలు, పూల దండలు, పూల డెకరేషన్, ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలు, వాల్ పోస్టర్లు తెలుగు, తమిళ భాషల్లో ముద్రణ పనులకు తక్కువ కొటేషన్ కోరుతున్నామని చెప్పారు. ఆసక్తి కలిగినవారు దేవస్థానం కార్యాలయంలో వారం రోజుల్లోగా కొటేషన్లు తెచ్చి ఇవ్వాలని కోరారు.

పల్లకిలో శివపార్వతుల విహారం

సోమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శివపార్వతులను ఊరేగించారు. శుక్రవారం ఉదయం ఆలయం శుద్ధి, మూలవిరాట్‌కు విశేష అలంకరణలు చేపట్టి ఉభయదారుల ఆధ్వర్యంలో అర్చకులు విద్యాసాగర్, రామూర్తి శాస్త్రి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉభయదారులచే చెక్కభజనలు, కోలాటాల నడుమ శివపార్వతులు పల్లకిలో ఊరేగించారు. భక్తులు ఉత్సవర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సోమశేఖర్ పర్యవేక్షించారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

సోమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్చాలని సోమల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎల్లయ్య కోరా రు. వేసవి సెలవులు ప్రారంభమైనా ఉపాధ్యాయులు పిల్లలను ప్రభు త్వ బడుల్లోనే చేర్చాలని శుక్రవారం సోమలలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలను కలిసి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పేందుకు సహకరించాలని కోరారు.

వడ్డిపల్లెలో రామకోటి మహోత్సవం

సోమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకుంటపల్లె పంచాయతీ ఎం. వడ్డిపల్లెలో రామకోటి మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉదయం అఖిలాండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉభయదారులు సుంకర వందన, ప్రకాశ్ దంపతులు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు బాబురావు, మోహన్‌నాయుడు, రమేశ్‌నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఒకరికి గాయాలు

చౌడేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. శుక్రవారం స్థానిక చిట్టెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు వసంతపల్లె నిరంజన్ (16) తన సొంత పనులు నిమిత్తం ఆటోలో చిట్టెడ్డిపల్లె నుంచి చౌడేపల్లెకు వచ్చి పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. అనంతరాయ చెరువు కట్టపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నిరంజన్ తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన నిరంజన్‌ను 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు.

మహిళపై దాడి

పుంగనూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా గురువారం రాత్రి కొందరు ఓ మహిళ కళ్లల్లో కారం కొట్టి దాడిచేసిన సంఘటన పుంగనూరులో జరిగింది. పోలీసులు కథనం మేరకు.. పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకు చెందిన కృష్ణప్పకు రెండు ఎకరాల పొలం ఉంది. ఆయనకు నలుగురు కుమారులుండగా తొమ్మిదేళ్ల క్రితం కుమారుడు హరి మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు కుమారులు ఆరునెలల క్రితం ఆస్తి విక్రయించడానికి ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో తమకు వాటా ఉందంటూ హరి భార్య సావిత్రమ్మ(45) వారి పిల్లలు అడ్డుకొని గొడవపడ్డారు. గురువారం రాత్రి గ్రామంలో శ్రీరాముడి ఊరేగింపు జరుగుతుండగా కృష్ణప్ప కుమారుడు రమేష్ మద్యం మత్తులో సావిత్రమ్మపై దౌర్జన్యం చేసి దాడికి దిగారు. రమేష్ వారి కుటుంబ సభ్యులు విష్ణు, మురళి, శివ,గంగాధర్, జయలక్ష్మి, సుమిత్ర, గణేష్‌లు సావిత్రమ్మ కంట్లో కారం చల్లి ముఖంపై రాళ్లతో కొట్టి రక్తగాయాలు చేశారు. గాయపడిన ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శుక్రవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకి బోయ సంఘం సంయుక్త కార్యదర్శిగా తిమ్మరాజు

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి బోయ సంఘం యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కుప్పం మండలం, కృష్ణదాసనపల్లె పంచాయతీ యానాదిపల్లె గ్రామానికి చెందిన ఎం.తిమ్మరాజు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఎం.మహేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

డీజీపీని కలిసిన చల్లా రామచంద్రారెడ్డి




రొంపిచెర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తాను శుక్రవారం కలిశారు.

గంగమ్మ జాతర కరపత్రాల ఆవిష్కరణ

పలమనేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఏటా జరిగే తిరుపతి గంగమ్మ జాతర కరపత్రాలను శుక్రవారం పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజీ స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30న గంగచాటు, మే 14న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 15న గంగమ్మ తల్లి విశ్వరూప దర్శనం, 16న అమ్మవారి జలది ఉత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బ్రహ్మయ్య, కుట్టి, గిరిబాబు, అమ్ములు, మురళీకృష్ణ, సుబ్బు, అరుణ్, హరీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొరబావి తోటలో గుడ్లగూబ దర్శనం



చౌడేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరబావి తోట వద్ద లక్ష్మీదేవి వాహనమైన గుడ్లగూబ శుక్రవారం ప్రత్యేక ఆకర్షణతో దర్శనమిచ్చింది. లక్ష్మీవారం రోజు రాత్రి సమయంలో దర్శనమివ్వడం శుభ సూచికమని పెద్దలు చర్చించుకున్నారు. సాధారణంగా గుడ్లగూబ చూపరులను భయపెడుతూ విచిత్రమైన అరుపులతో దర్శనమిస్తుంది. అయితే అందంగా, బంగారు రంగులో చూపరులను ఎంతగానో ఆకర్షించింది.

చంద్రబాబుతో హరిత విప్లవం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో, ప త్ర్యేకించి కుప్పంలో హరిత విప్లవం సాధ్యమైందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన వ్యక్తిగత వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తీవ్రమైన కరువుతో పంటలు పండక, అప్పులపాలై అల్లాడుతున్న రైతాంగాన్ని ఇజ్రాయిల్ టెక్నాలజీని తీసుకొచ్చి చంద్రబాబు ఎంతో ఆదుకున్నారన్నారు. బిందు, తుంపర్ల సేద్యాలతోపాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించడం నేర్పి వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా అవసరమున్న ప్రతీ పేద రైతుకూ సబ్సిడీ పథకాలు అమలు చేస్తున్న నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబును పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతుల వైపు పాలకులు తిరిగి చూడలేదని, ఆ ఐదేళ్ల కాలమూ వ్యవసాయ రంగం కుదేలై రైతులు అప్పులపాలయ్యారని విమర్శించారు. మళ్లీ అధికారంలోకి చంద్రబాబు రావడంతో రద్దయిన సబ్సిడీ పథకాలన్నీ మనుగడలోకి తెచ్చి రైతులకు సాయం చేస్తున్నారని చెప్పారు. కుప్పం మండలానికి సంబంధించి రూ.8,83,867 విలువ కలిగిన వ్యవసాయ పనిముట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఇందులో రూ.3,88,180 మేర సబ్సిడీ రూపంలో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. రోటోవేటర్లు, మడకలు, కలుపు తీసే యంత్రాలు, పవర్ టిల్లర్లు, పెట్రోలు పంపులు, బ్యాటరీ పంపులు సబ్సిడీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా, మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పలువురు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం


పలమనేరులో ర్యాలీ


చౌడేపల్లెలో...

కల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వ వైద్యాధికారులు జానకీరావు, సుబ్రహ్మణ్యం తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ దోమల కారణంగానే మలేరియా వ్యాపిస్తుందని.. దోమకాటు నుంచి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

●చౌడేపల్లె: అందరి కృషితో మలేరియా వ్యాధిని నిర్మూలించొచ్చని డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● సోమల: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి జయసింహ పేర్కొన్నారు. శుక్రవారం సోమలలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ఇర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ నీలిమా, డాక్టర్ విజయలక్ష్మి, సీహెచ్‌వో అమరనాథ్, రహీమా, హేమలత, లత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: దోమల నివారణతో ఆరోగ్యం సాధ్యమని పలమనేరు యూనిట్ అధికారి జయశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పలమనేరు పాతపేట, కాకాతోపులోని ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బైరెడ్డిపల్లె, తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యాధికారులు విజయచందర్, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, డీపీఎంవో దయానందం, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచెర్ల : రొంపిచెర్లలో శుక్రవారం వైద్యులు డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, డాక్టర్ వినయ్‌ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో కాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

● రామకుప్పం: విజలాపురంలో వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు పూజిత, సాయిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు,

రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు


సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి ఆరీపుల్లా


సోమలలో మాట్లాడుతున్న సీఈవో రెడ్డెప్ప

చౌడేపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జి అధికారి ఆరీపుల్లా అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆయన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతులు సహకార సంఘం సభ్యులుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

● కల్లూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రైతులకు విరివిగా పంట రుణాలు అందించనున్నట్లు పులిచెర్ల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హరికృష్ణ, మండల వ్యవసాయధికారి హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వ్యవసాయ రుణాలపై డీసీసీ బ్యాంకు ఖాతాదారులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరా పంట సాగుకోసం రూ.85 వేలు 7 శాతం వడ్డీతో మంజూరు చేస్తామన్నారు. ఒక్కో రైతుకు అధికంగా రూ.3 లక్షల వరకు పంట రుణాలు అందుతాయని తెలిపారు. బోరు, మోటారు, పైపులైన్ల కోసం రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణ, ధనంజయనాయుడు, నజీర్, రవీంద్రారెడ్డి, గుర్రప్ప, ప్రభాకర్, సర్పంచ్ రాణి, కల్లూరు డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ వెంకట్రమణ, పులిచెర్ల పీఏసీఎస్ సీఈవో సుబ్రహ్మణ్యం , రైతులు పాల్గొన్నారు.

● సోమల: సోమల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి అర్హులైన ప్రతి రైతుకు రుణాలు అందజేస్తామని సీఈవో చిన్నరెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సంఘ సభ్యులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే రుణాలు పొందేందుకు, తిరిగి చెల్లింపుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏవో సుధాకర్, ఏఎంసీ కార్యదర్శి సరళాదేవి, పర్సన్ ఇన్‌చార్జి ఈ.రెడ్డెప్ప, టీడీపీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రాల కోఆర్డినేటర్లకు సూచనలిస్తున్న పలమనేరు ఆర్డీవో పి.భవాని

పలమనేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయని.. విద్యార్థులు గంటకు ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పలమనేరు ఆర్డీవో పి.భవాని అన్నారు. శుక్రవారం ఆమె పరీక్షల నిర్వహణపై కోఆర్డినేటర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పలమనేరులోని 5 కేంద్రాల్లో సుమారు 1,621 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు బందోబస్తు, తాగునీటి వసతి, శానిటేషన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జగన్నాథరావు, డాక్టర్ మొహమ్మద్, తహశీల్దారు ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున రెడ్డి, సీఐలు, ఆర్టీసీ అధికారులు, ట్రాన్స్‌కో ఏఈ, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాది అంతమే భారతీయుని పంతం


పలమనేరులో...

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ కుప్పంలో జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల సంతాప దినాలు శుక్రవారంతో ముగిశాయి. మూడో రోజున ఆర్టీసీ బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులో శుక్రవారం ఉగ్రదాడికి నిరసనగా ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి, పరమశివప్ప, రెడ్డెప్ప, పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు , విశ్వహిందూ పరిషత్ నాయకులు సిద్దయ్య, మోహన్ పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: ఉగ్రవాదులను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ పుంగనూరులో శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ చేశారు. న్యాయవాదులు చెన్నకేశవులు, రఘు, ఎన్.రెడ్డెప్ప, శైలేంద్ర, షరత్, సీవీ శ్రీనివాస్, గిరి, ప్రభాకర్‌నాయుడు, అంజిబాబు, హరినాథరెడ్డి, పగడాల రమణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సంస్థాగత ఎన్నికలు


ఎన్నికల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు కొనసాగుతున్నాయి. శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో తీర్థం పంచాయతీలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా గోవిందస్వామి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రామప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే దేవదొడ్డి పంచాయతీ అధ్యక్షుడిగా భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మంజునాథ్, గడ్దూరు అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ఎం.కొత్తూరు అధ్యక్షుడిగా రెడ్డెప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయరామప్ప, కంభంపల్లె అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, వెంగంవారిపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నారాయణప్ప, గౌనితిమ్మేపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కడపనత్తం పంచాయతీ అధ్యక్షుడిగా దామోదర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రప్ప ఎన్నికయ్యారు. వీరిని పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కుప్పం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం, గుడ్లనాయనిపల్లె 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట, దళవాయికొత్తపల్లె, మోడల్ కాలనీ, మండల పరిధిలోని పరమసముద్రం, కృష్ణదాసనపల్లె, గుడుపల్లె పరిధిలోని వెంకటాపురం, అలుగుమానిపల్లె గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని రెస్కో ఎండీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వాటర్ ప్లాంట్‌లు బాగుచేయాలని సీఎంకు వినతి



తవణంపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో ఉన్న వాటర్ ప్లాంట్‌లలో తాగునీటి శుద్ధి యంత్రాలను బాగుచేయాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని, ఉపాధి హామీ బిల్లులు విడు దల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. అమరావతిలో సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కరిమున్నీసా

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే శక్తి యాప్ రూపొందించి నట్లు ఎస్‌ఐ కరిమున్నీసా తెలిపారు. శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శక్తి యాప్‌పై నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమానిత, అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాద పరిస్థితుల్లో శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. ప్రతి ఒక విద్యార్థినీ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపదలో యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్‌ను నొక్కితే వెంటనే వారి వద్దకు పోలీసులు వస్తారని తెలియజేశారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలను కట్టడి చేయాలి

నగరి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): వన్నెకుల క్షత్రియులకు సంబంధించి నకిలీ ధ్రువీకరణ పత్రాలను కట్టడి చేయాలని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్లు శుక్రవారం నగరి తహసీల్దార్ ధనంజయలుకు వినతిపత్రం అందించారు. రిజిస్టర్ అయిన కులసంఘం నుంచి వచ్చిన వారికి మాత్రమే కులధ్రువీకరణ పత్రాలను అందించాలని కోరారు. ఈ .కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ డైరెక్టర్లు తేజోవతి, మునిరత్నంరెడ్డి, బాలసుబ్రమణ్యం, మిన్నల్ రవి, శ్రీనివాసులురెడ్డి, కిరీటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుకుమార్, లోకేష్ పాల్గొన్నారు.

నాయకుడిగా కాదు మిత్రుడిగా పరిష్కరిస్తా



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య లను నాయకుడిగా కాకుండా మిత్రుడిగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు 54 వినతులు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను ఎమ్మెల్యే సావధానంగా విన్నారు. అప్పటికప్పుడే పరిష్కరించదగిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి వెంటనే వాటిని పరిష్కరిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, కర్ణ, జవహర్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కుమార్‌నాయుడు, వరదరాజులు, అలెక్స్ పాల్గొన్నారు

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ బలరామ్ కథనం మేరకు.. యాదమరి మండలం ముద్దురామాపురానికి చెందిన తులసీకుమార్(40) న్యూ బాలాజీ కాలనీ కేశవరెడ్డి పాఠశాల సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వా స్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



చెక్కును ఇస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తూ శుక్రవారం మృతిచెందిన శంకరమ్మ కుటుంబ సభ్యులకు పోలీసు అధికారులు ఆర్థికసాయాన్ని అందజేశారు. నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్న శంకరమ్మ ఈ నెల 19వ తేదీన అనారోగ్యంతో మర ణించారు. దాంతో ఆమె కుమారుడు చంద్రబాబుకు ఐడీఆర్ఎఫ్ ఫండ్ కింద రూ. లక్ష, విడో ఫండ్ నుంచి రూ. 50వేలు కలిపి రూ. 1.50 లక్షల మొత్తాన్ని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అందించారు. ఈ కార్యక్రమంలో బి.సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భూసారపరీక్షలకు అనుగుణంగా సాగుచేయండి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా భూసార పరీక్షల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు పంచాయతీ అక్కనగారిపల్లె గ్రామంలో గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం మండలాల రైతులకు భూసారపరీక్షలు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలని సూచించారు. వ్యవసాయాధికారులు భవాని, నర్మద, ఏపీసీఎన్ఎఫ్, విఏఏ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

27న యోగ శిక్షణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): సిద్ధ సమాధి యోగా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గిరింపేట నగర పాలక ఉన్నత పాఠశాలలో పెద్దలకు ఆదివారం సాయంత్రం ఉచిత యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యోగా గురువు నరేంద్ర కుమార్‌జీ తెలిపారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): స్థానిక రాముల గుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నత్రే వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు సుభాష్‌జైన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సహకారంతో ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన కంటి రోగులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వస్తారని తెలియజేశారు.

స్పౌస్ పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్పౌస్ పెన్షన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కార్వేటినగరం ఎంపీడీవో టి.చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో భర్త పింఛను తీసుకుంటూ ఉండి చనిపోయి ఉంటే అతని భార్యకు స్పౌస్ పెన్షన్ మంజూరు చేస్తారని వివరించారు. డెత్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, భర్త పింఛను పుస్తకం తదితర వాటిని తీసుకెళ్లి దరఖాస్తు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

వెదురుకుప్పం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శుక్రవారం తెలిపారు. పచ్చికాపల్లం, వెదురుకుప్పం, దేవళం పేట ఇండియన్ బ్యాంకు శాఖలకు 28 యూనిట్లను మంజూరు చేశారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మేనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పరిధిలోని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. నగరంలోని కోర్టు, గాంధీరోడ్డు, జెండామానువీధి, మార్కెట్, మురకంబట్టు, వెంగనపల్లి తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు 'మన ఊరికి - మన థామస్'

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మన ఊరికి - మన థామస్ కార్యక్రమంలో భాగంగా నెల్లేపల్లె పంచాయతీ ఎన్.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడలో శనివారం సాయంత్రం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు స్వామి దాస్ తెలిపారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించ నున్నట్లు వివరించారు.

జడ్జి విష్ణువర్మకు ఘనంగా వీడ్కోలు



నగరి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): నగరి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి విష్ణువర్మ వెంకటగిరి కోర్టుకు బదిలీ కావడంతో ఇక్కడి బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. నగరి, నింద్ర, విజయపురం పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులు, న్యాయవాదులు ఆయనకు వీడ్కోలు పలికారు.

రుణాల మంజూరుపై అవగాహన



మాట్లాడుతున్న సహకార సంఘం అధికారి కృష్ణ

నింద్ర,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘంలోని రైతులకు రుణ మంజూరు విధానంపై నింద్రలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సూపర్‌వైజర్ ఎం.కృష్ణ మాట్లాడుతూ రైతులు సింగిల్ విండో సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, వ్యవసాయాధికారి తులసి, ఇన్‌చార్జి సీఈవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణాలు ఇస్తామని గుడిపాల సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపాల సింగిల్ విండో కార్యాలయంలో రుణాల మంజూరుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈవో పట్టాబి, వ్యవసాయ అధికారి మాధవి, సూర్‌వైజర్ ధన, సింగిల్ విండో సిబ్బంది సెల్వం, జయరాజ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

కంచిగరుడ సేవ వైభవంగా జరిపించండి

నగరి,ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో మే13న జరిగే కంచి గరుడసేవను వైభవంగా జరిపించాలని ఆలయ సలహా మండలి, భక్తులు ఆలయ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. నగరి కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు విన్నవించారు. ప్రసాదాలు, మజ్జిగ, శీతలపానీయాలు, అన్నదానం సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు ధన్వంత ఆచార్యులు, నరసింహమూర్తి, ఆలయ సేవా సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

- ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నివాళి
- కార్వేటినగరంలో మానవహారం





బంగారుపాళెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు, నగరిలో సీపీఐ ర్యాలీ, కార్వేటినగరంలో కూటమి నాయకుల మానవహారం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడులను నిరసిస్తూ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధరణీప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు టీడీపీ నాయకులు, అభిమానులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదాన్ని అంతమొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

నగరి: ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో సీపీఐ శ్రద్ధాంజలి ఘటించింది. తీవ్రవాదుల్ని అణచి వేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వేలన్, బాషా, రవి, లాజర్, హరి, ఏసయ్య, ఢిల్లీబాబు, సురేష్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఉగ్రదాడి మృతులకు అంజలి ఘటిస్తూ కార్వేటినగరంలోని గాండ్లమిట్ట కూడలిలో మానవహారం చేపట్టారు. జనసేన జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయయాదవ్ పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీసీసీబీ చీఫ్ మేనేజరు సురేష్‌బాబు, వేదికపై ఏవో అనిత తదితరులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, డీసీసీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చీఫ్ మేనేజరు కె.సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రుణాల మంజూరుపై రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట, బంగారు తాకట్టు రుణాలు విరివిగా ఇస్తామ న్నారు. బిజినెస్ కరస్పాండెంట్లను నియమించి ఆర్థిక లావాదేవీలకు సహకరించాలని మారేపల్లికి చెందిన నారాయణరెడ్డి చీఫ్ మేనేజరును కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామ న్నారు. అంతకుముందు ఉగ్రదాడిని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సీఈవో బి.రమేష్, పీఐసీ బాబు, ఏవో వనిత, ఏఈవో దయాకర్, డీసీసీబీ సూపర్‌వైజర్ సుధీర్‌కుమార్, దామోదరంరెడ్డి, బాలయ్య, మునస్వామి, దేవిక, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన మురళి అన్నారు. ఉపాధి పనులు కల్పించలేదని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో ఎంపీడీవో మోహనమురళి, ఏపీవో లలిత శుక్రవారం మంగుంటలో సమావేశం నిర్వహించారు. మస్టర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఎవరికైనా పనులు కావాలంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 90రోజులు పని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ నౌషద్, ఎఫ్ఏ గుణశేఖర్ పాల్గొన్నారు.

అధిక దిగుబడి వచ్చే చెరకు సాగుచేయండి

- శాస్త్రవేత్తలు ఠాగూర్, నాగమణి



ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త నాగమణి

విజయపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి వచ్చే చెరకు రకాలను సాగు చేయాలని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కేఆర్ ఠాగూర్ సూచించారు. శుక్రవారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో చెరకు రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకులో 2009ఏ107, 2006ఏ223, 2009ఏ252, 2005టి16, 2016టి7 వంటి రకాలు మన వాతావరణానికి అనుకూలంగా ఉంటాయన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ.. మలాథియా రెండు మిల్లీ లీటర్లు లేదా ఇమిడా క్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్లు పాటుగా కార్బండిజమ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి చెరకు ముచ్చెలను అరగంట పాటు రసాయనంలో ముంచి తర్వాత నాటు కోవాలని సూచించారు. సాగర్ షుగర్ ఫ్యాక్టరీ అధికారి రవి, మండల వ్యవసాయాధికారి రజనీకుమారి, ఏఈవోలు ప్రియ, పవిత్ర, రైతులు రవినాయుడు, మునిభాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గురజాల ప్రజాదర్బార్‌కు 68 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజాదర్బార్‌కు 68 వినతులు అందాయి. శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు.. ప్రజల నుంచి వచ్చిన వినతులను మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 40 వినతులు వచ్చాయి. అందులో ముఖ్యంగా నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, పింఛన్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, గుడిపాల తహసీల్దార్ జయంతి, ఎంఈ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కోసలనగరం సింగిల్ విండో ఇన్‌చార్జి సీఈవోపై విచారణ



సీఈవోను విచారిస్తున్న అధికారులు

విజయపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం సింగిల్ విండో ఇన్‌చార్జి సీఈవోపై ప్రత్యేకాధికారి విచారణ చేపట్టారు. 'కోసలనగరం సింగిల్ విండోకు రెగ్యులర్ సీఈవోను నియమించండి' అనే శీర్షికన ఈనెల 24వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీంతో ఇన్‌చార్జి సీఈవోపై ప్రత్యేకాధికారి రమణ శుక్రవారం విచారణ నిర్వహించారు. బంగారు రుణాల వివరాలు, సొసైటీలో కొత్తగా చేరినవారి వివరాల రికార్డులు పరిశీలించారు. అవినీతి ఆరోపణలపై సీఈవోను వివరణగా కోరగా.. కొందరు తమపై కక్ష సాధింపుతో ఇలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు ప్రత్యేకాధికారి తెలియజేశారు. అనంతరం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో రజినీకుమారి, డీసీసీబీ బ్యాంకు సూపర్‌వైజర్ ఆనంద్, ఇన్‌చార్జి సీఈవో రాధ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరంలో యాంటీ లార్వా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. నాగాలమ్మ ఆలయం వెనుక నిల్వ నీటిలో దోమల లార్వాల నియంత్రణకు ఆయిల్‌బాల్స్ వేశారు. మలాథిన్ పిచికారి చేశారు. చర్చివీధిలో మురుగునీటి కాల్వలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు. మలేరియా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమశ్రీ ఆధ్వర్యంలో పచ్చికాపల్లంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: మన ప్రయత్నంతో మలేరియా అంతం కావాలని వైద్యాధికారి విష్ణుప్రియ పేర్కొన్నారు. విజయపురంలో మలేరియా నిర్మూల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సుమలత, వినిషా, వైద్య సిబ్బంది గోపీ, శ్రీదేవి, సురేష్ పాల్గొన్నారు.

తవణంపల్లె: తవణంపల్లెలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. టి.పుత్తూరు రోడ్డు కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు ప్రయాంక, వినయ్‌కుమార్, కేశవ నారాయణ, మోహన్ వేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: గుడిపాలలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడేగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలసూరి, నారాయణ, విజయ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.





పచ్చికాపల్లంలో నిర్వహిస్తున్న ర్యాలీ, యాంటీ లార్వా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చిత్తూరు నగరపాలక కమిషనక నరసింహప్రసాద్

బీమా పథకాలపై అవగాహన

వెదురుకుప్పం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనపై ఎంపీడీవో పురుషోత్తం అవగాహన కల్పించారు. ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బీమాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఏపీవో నాగమణి, ఏపీఎం పరశురామిరెడ్డి, ఏపీవో మీనాకుమారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజ

వెదురుకుప్పం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలతో పాటు నందీశ్వరునికి ప్రదోష పూజలు చేశారు.

గాయపడిన సర్పంచ్‌కు పరామర్శ

విజయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగరంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో గాయపడి తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నా సుధాకర్‌ను శుక్రవారం వైసీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి పరామర్శించారు. ఆయనతోపాటు వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ శ్యాంలాల్ పాల్గొన్నారు.

రుణాలపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి ప్రసాద్

పెనుమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో శుక్రవారం రైతులకు రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్సన్ ఇన్‌చార్జి ప్రసాద్ మాట్లాడుతూ ఇతర బ్యాంకుల కన్నా సులభతరంగా డీసీసీబీ బ్యాంకుల్లో రైతులు రుణాలు పొందవచ్చని తెలియజేశారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఉమావాణి, ఏవో శ్రీనివాసులు, డీసీసీబీ బ్యాంకు మేనేజరు, సీఈవో మురుగన్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చండి

యాదమరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లి హైస్కూల్ ప్లస్‌లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పాఠశాల కమిటీ చైర్మన్ నవీన్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతిలో ఏడుగురు విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించారని వివరించారు. టాపర్స్‌గా దాక్షాయణి 563, హిమేష్ 555 మార్కులతో మండలంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలియజేశారు.

30న గంగమ్మ తిరునాళ్ల

గుడపాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపాల పంచాయతీ ముత్తువాళూరు గ్రామంలో ఈ నెల 29, 30 తేదీల్లో గంగమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లైసెన్స్ మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు అవసరమైన లైసెన్స్ పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ నరసింహప్రసాద్ తెలియజేశారు. టెక్నికల్ సర్వేయర్, లైసెన్స్ స్ట్రక్చరల్ ద్వారా ఇంజనీర్‌గా కొత్తగా లైసెన్స్ పొందటానికి ఐటీఐ సివిల్, డిప్లొమో సివిల్, బీటెక్ సివిల్ కోర్సులు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా లేదా apobps/apdpms పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనుమానాదస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. మండలంలోని గాండ్లపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి భార్య అద్దాలమ్మ (60) పశువులు మేపుతూ జీవనం సాగించేది. మూడు రోజుల క్రితం ఈమె వ్యవసాయ బావి వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికారు. ఈ క్రమంలో ఆమె శుక్రవారం ఓ రైతు వ్యవసాయ బావిలో శవమై తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నగల కోసమే హత్యా..?

అద్దాలమ్మ మెడలోని ఐదు సవరాల బంగారు చైను, కమ్మలు చోరీకి గురయ్యాయి. ఆమె చెవి తెగి ఉంది. ఒక చెయ్యి విరిగిపోయి ఉంది. దీంతో నగల కోసం ఆమెను హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాచిగుంట పంచాయతీలో తనిఖీలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాచిగుంట పంచాయతీలోని వేర్వేరు గ్రామాల్లో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి శుక్రవారం తనిఖీలు చేశారు. గొల్లపల్లెలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణ పనులపై లబ్ధిదారులతో చర్చించారు. అదేవిధంగా చౌటూరు వద్ద తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి కుమార్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.